పల్లెకు చేరని వెలుగులు..

రాశిమెట్ల రహదారి

- మారుమూల గ్రామాలకు రాని బస్సు సర్వీసులు
- రహదారి సౌకర్యం ఉన్నా సేవలు సున్నా
- మహాలక్ష్మికి మహిళలు, విద్యార్థులు దూరం

మామడ, డిసెంబర్ 20 : అన్ని ఉన్నా అల్లుడి నోట్లో శని అన్న చందంగా మారింది. మారుమూల గ్రామాల పరిస్థితి. మండలంలోని గుట్టమీది గ్రామాల ప్రజలకు పల్లె వెలుగు బస్సు సేవలు అందడం లేదు. ఆ గ్రామాలకు రహదారి సౌకర్యం ఉన్నా ఆర్టీసీ అధికారులు బస్సులు నడపకపోవడంతో ప్రజలు,విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాలలు, కళాశాలలకు సమయానికి చేరుకోలేక విద్యార్థులు అష్టకష్టాలు పడుతున్నారు. బస్సులు నడపాలని ఎన్నోసార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని గిరిజన ప్రజలు, విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మొండిగుట్ట, సోన్‌పేట్, తాండ్ర,వాస్తపూర్, గాయిద్‌పెల్లి, రాశిమెట్ల, తోటిగూడ, రచ్చకోట, ఆరెపెల్లి గ్రామాల మీదుగా సుమారు 10కిలోమీటర్లు రహదారి సౌకర్యం ఉంది. ఈ రహదారిపై బస్సులు నడపడానికి ఎటువంటి ఇబ్బంది లేదు. మహాలక్ష్మీ పథకానికి విశేష స్పందన వస్తుండడంతో తమ గ్రామాలకు బస్సులు నడపాలని మహిళలు కోరుతున్నారు.

బస్సులు నడపాలి

తోటిగూడ, గాయిద్‌పెల్లి, తాండ్ర గ్రామాల నుంచి ప్రజలు నిర్మల్‌కు ఆటోల్లో వెళ్తున్నారు. దీంతో తరుచూ ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం మహిళలకు మహాలక్ష్మి ద్వారా ఉచిత ప్రయాణం కల్పిస్తున్నది. బస్సులు నడిపితే ప్రజలకు ఆర్థిక భారం తగ్గుతుంది.

- కందుల భూమవ్వ, తాండ్ర,(మామడ)

క్రీడా పోటీల ఏర్పాట్లు పరిశీలన

ఏర్పాట్లను పరిశీలిస్తున్న జిల్లా అధికారి పద్మ

నిర్మల్ టౌన్, డిసెంబర్ 20 : నిర్మల్‌లోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో గురువారం నుంచి శనివారం వరకు రాష్ట్రస్థాయి అండర్-17 సాఫ్ట్‌బాల్ పోటీలు నిర్వహించనున్న నేపథ్యంలో ఏర్పాట్లను జిల్లా ఏసీజీఈ అధికారి పద్మ పరిశీలించారు. 33 జిల్లాల క్రీడాకారులు వస్తున్నందున అన్ని వసతులు కల్పించాలని అధికారులను ఆదేశించారు. నఫేఖాన్, పీఈటీలు రమణా రావు, భోజన్న, తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కుకు మరో అవకాశం

దస్తురాబాద్, డిసెంబర్ 20 : ఓటు హక్కు నమోదు కోసం కేంద్ర ఎన్నికల సంఘం మరో అవకాశం కల్పించిందని తహసీల్దార్ ఎండీ జాకీర్ పేర్కొన్నారు. 2024 జనవరి 1 వరకు 18 ఏండ్లు నిండిన వారు ఓటరుగా నమోదు చేసుకోవాలసి సూచించారు. ఫారం 6 ద్వారా బీఎల్వోల వద్దకు వెళ్లి దరఖాస్తు చేసుకోవాలన్నారు. వయోజనులు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు విద్యార్థిని ఎంపిక

ఆర్ నవిత

ముధోల్, డిసెంబర్ 20 : మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని ఆర్ నవిత రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైంది. ఆదిలాబాద్‌లో జరిగిన ఉమ్మడి జిల్లా జోనల్ లెవెల్ అండర్ -17 ఇయర్స్ బాల, బాలికల కబడ్డీ టోర్నమెంట్ సెలక్షన్‌లో ఉత్తమ ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయికి ఎంపికైంది. హన్మకొండలో జరిగే రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ కబడ్డీ పోటీల్లో నవిత పాల్గొంటుంది. నవితను హెచ్ఎం, ఉపాధ్యాయులు, సర్పంచ్ వెంకటాపూర్ రాజేందర్, ఎంపీపీ అయేషా అఫ్రోజ్ ఖాన్, ఎంపీటీసీలు సరళా శ్రీనివాస్ గౌడ్, దేవోజీ భూమేశ్ అభినందించారు.

నేడు సృజన టెక్‌ఫెస్ట్ 2023 పోటీలు

నిర్మల్ చైన్‌గేట్, డిసెంబర్ 20 : నిర్మల్‌లోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఈ నెల 21న సృజన టెక్‌ఫెస్ట్ 2023 పోటీలు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ పీ అన్నపూర్ణ తెలిపారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పరిధిలోని పాలిటెక్నిక్ కళాశాలల్లో మెకానికల్ ఇంజినీరింగ్, అనుబంధ ఇంజినీరింగ్ కోర్సులు చదివే విద్యార్థులు స్థానిక కళాశాలలో మెకానికల్ ఇంజినీరింగ్ హెచ్‌వోడీ, డిస్ట్రిక్ కోఆర్డినేటర్ బీ రాంబాబు వద్ద రిపోర్టు చేయాలని సూచించారు.

రేపు ఆర్ఎంపీ, పీఎంపీ కార్యవర్గ సమావేశం

సోన్, డిసెంబర్ 20 : నిర్మల్ జిల్లా ఆర్ఎంపీ, పీఎంపీల కార్యవర్గ సమావేశం శుక్రవారం నిర్వహిస్తున్నట్లు జిల్లా కార్యవర్గ సభ్యులు నర్సింగ్‌రావు, రమేశ్ యాదవ్ తెలిపారు. ఉదయం 10 గంటలకు నిర్వహించే సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకుంటామని అధ్యక్ష, కార్యదర్శులు హాజరు కావాలన్నారు.

జాఫ్రాపూర్ పాఠశాలకు కార్పెట్ల విరాళం

సోన్, డిసెంబర్ 20 : సోన్ మండలం జాఫ్రాపూర్ ఉన్నత పాఠశాల విద్యార్థుల సౌకర్యార్థం బుధవారం కార్పెట్లను విరాళంగా అందించారు. నిర్మల్ పట్టణానికి చెందిన ట్యాక్స్ కన్సల్టెంట్ పోలిశెట్టి రాజు కార్పెట్లను అందించారు. హెచ్ఎం తొడిశెట్టి పరమేశ్వర్, ఉపాధ్యాయులు నగేశ్‌కుమార్, ముత్తన్న అనిత, విజయమాల, ఆసిఫ్‌అలీ, మసియొద్దీన్, విజయలక్ష్మి, వీడీసీ అధ్యక్షుడు కొరిపెల్లి రమేశ్‌రెడ్డి, తదితరులున్నారు.

ప్యారమూర్‌లో కొనసాగుతున్న ఉత్సవాలు

సారంగాపూర్, డిసెంబర్ 20 : మండలంలోని ప్యారమూర్ గ్రామంలో గల దత్తసాయి మందిరంలో దత్తజయంతి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా బుధవారం శ్రీసాయి చరిత్ర, గురుచరిత్ర సప్తాహ పారాయణాన్ని భక్తులతో నిర్వహించారు. ఈ కార్యక్రమం 26వ తేదీ వరకు ఉంటుందని వీడీసీ సభ్యులు తెలిపారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు.

కాలభైరవస్వామి ఆలయంలో పూజలు

నిర్మల్ టౌన్, డిసెంబర్ 20 : అష్టమిని పురస్కరించుకొని నిర్మల్‌లోని చింతకుంటవాడ కాలభైరవ స్వామి ఆలయంలో బుధవారం భక్తులు పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కాలనీవాసులు పోశెట్టి, శేఖర్, శ్రీకాంత్, రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

పూజలు చేస్తున్న భక్తులు

ఆదివాసీ రైతులతో మాట్లాడుతున్న రెవెన్యూ అధికారులు

పోడు పట్టాలిచ్చి ఆదుకోవాలి

కడెం, డిసెంబర్ 20: మండలంలోని నచ్చన్‌ఎల్లాపూర్ పరిధిలోని గోండుగూడ గ్రామానికి చెందిన ఆదివాసీలకు పోడు భూములకు పట్టాలిచ్చి ఆదుకోవాలని ఇటీవల జిల్లా కలెక్టర్‌ను కలిసి పోడు రైతులు విన్నవించారు. దీంతో మంగళవారం ఆర్ఐ లక్ష్మణ్ ఆధ్వర్యంలో గ్రామంలో సర్వే చేపట్టారు. ఈ సందర్భంగా ఆదివాసీ రైతులు మాట్లాడుతూ 20 సంవత్సరాలుగా ఇక్కడి అటవీ భూమిని పోడు చేసుకుంటూ 20 కుటుంబాలు జీవనం సాగిస్తున్నామని, అటవీ శాఖ అధికారులు తమపై అక్రమ కేసులు నమోదు చేస్తున్నారని అధికారులకు వివరించారు. రెవెన్యూ సిబ్బంది 20 మంది పోడు రైతులతో పాటు, సాగు చేసుకున్న భూములను పరిశీలించారు. సంబంధింత వివరాలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని వారికి సూచించారు. రైతులు ఆత్రం రాజేశ్వర్, నైతం గిరిజబాయి, వెడ్మా పూర్ణాబాయి, గంగు బాయి, నాగోరావు, తోడసం రవీందర్, వెడ్మ లక్ష్మణ్, తుకారం, సోము, రావు, అమృత్‌రావు, మోతీరాం పాల్గొన్నారు.

వివేకానందుడిని ఆదర్శంగా తీసుకోవాలి

- నిర్మల్ అదనపు కలెక్టర్ ఫైజన్ అహ్మద్
- అలరించిన సాంస్కృతిక పోటీలు

నిర్మల్ చైన్‌గేట్, డిసెంబర్ 20 : యువత వివేకానందుడిని ఆదర్శంగా తీసుకోవాలని నిర్మల్ అదనపు కలెక్టర్ ఫైజన్ అహ్మద్ పేర్కొన్నారు. స్వామి వివేకానంద జయంతి సందర్భంగా నిర్మల్‌లోని ఎన్టీఆర్ స్టేడియంలో జిల్లా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి యువజన ఉత్సవాలను మంగళవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి హాజరైన అదనపు కలెక్టర్ మాట్లాడుతూ భారతీయ సంస్కృతిని స్వామి వివేకానందుడు విశ్వవ్యాప్తం చేశారని గుర్తు చేశారు.జిల్లాలోని యువతీ, యువకులు సాంస్కృతిక పోటీల్లో పాల్గొన్నారు. ఈ పోటీలు అలరించాయి. ప్రతిభ చూపిన వారిని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో డీవైఎస్వో నాఫేఖాన్, సీజీవో పద్మ, పేటా అసోసి యేషన్ కార్యదర్శి భోజన్న, ఎస్జీఎఫ్ కార్యదర్శి రమణారావు, న్యాయ నిర్ణేతలు జోసఫ్ బాబూ రావు, సంపత్, కోటగిరి నర్సయ్య, దనాల కోట కృష్ణవర్మ, ఎలిశెట్టి సుదర్శన్, కడారి రఘునాథ్, అయిట్ల ప్రవీణ్, చెనిగరపు నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ ఫైజన్ అహ్మద్

సాంస్కృతిక ప్రదర్శన ఇస్తున్న యువతీ, యువకులు

బుట్టాపూర్‌లో డీపీవో పర్యటన

దస్తురాబాద్, డిసెంబర్ 20 : మండలంలోని బుట్టాపూర్ గ్రామంలో బుధవారం జిల్లా పంచాయతీ అధికారి శ్రీలత పర్యటించారు. ఈ సందర్భంగా నర్సరీ, పల్లె ప్రకృతి వనం, సెగ్రిగేషన్ షెడ్డు, డ్రైనేజీ, రోడ్లు, ఎవెన్యూ ప్లాంటేషన్‌ను పరిశీలించా రు. జీపీ కార్యాలయంలో పలు రికార్డులను పరిశీలించారు. గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచాలని, రోడ్లు, డ్రైనేజీలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. ఆమె వెంట పంచాయతీ కార్యదర్శి మల్లేశ్, తదితరులు ఉన్నారు.

దరఖాస్తు చేసుకోండి

నిర్మల్ టౌన్, డిసెంబర్ 20 : షెడ్యూల్ కులాల అభివృద్ధి సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్మల్ జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో చదువుతున్న ఇంటర్, డిగ్రీ, సాధారణ వృత్తి నైపుణ్యత కోర్సులు చదువుతున్న విద్యార్థులు ఉపకార వేతనాల కోసం దరఖాస్తు చేసుకోవాలని జిల్లా అధికారి రాజేశ్వర్ గౌడ్ తెలిపారు. 2023-24 విద్యా సంవత్సరానికి గానూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులు కళాశాలకు సంబంధించిన అన్ని ధ్రువీకరణపత్రాలతో ఆన్‌లైన్‌లో ఈనెల 31లోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఇతర వివరాలకు కళాశాలలో సంప్రదించాలని కోరారు.

సుస్థిర జీవన విధానం నేర్చుకోవాలి

నిర్మల్ టౌన్, డిసెంబర్ 20 : విద్యార్థి దశలోనే ప్రతి ఒక్కరూ సుస్థిర జీవన విధానం అలవాటు చేసుకోవాలని ఎన్‌జీసీ రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ విద్యాసాగర్ అన్నారు. బుధవారం నిర్మల్‌లోని ఎస్ఆర్ పాఠశాలలో సుస్థిర జీవన విధానం, జిల్లాస్థాయి సెమినార్‌కు హాజరయ్యారు. ఆర్పీలు శివ కిరణ్, వెంకటే శ్వర్లు, ఎన్‌జీసీ అధికారి పద్మ, జిల్లా కో ఆర్డినేటర్ మోహన్‌రావు, సైన్స్ అధికారి వినోద్, సెక్టోరల్ అధికారి నర్సయ్య, తదితరులు పాల్గొన్నారు

నర్సరీ పనులను వేగంగా పూర్తి చేయాలి

పెంబి, డిసెంబర్ 20 : గ్రామాల్లో నర్సరీ పనులను వేగంగా పూర్తి చేయాలని ఎంపీవో చిక్యాల రత్నాకర్ రావు పేర్కొన్నారు. బుధవారం శెట్‌పల్లి, జంగన్‌గూడ గ్రామాల్లో పర్యటించి నర్సరీ, పల్లె ప్రకృతి వనాన్ని పరిశీలించారు. పంచాయతీ కార్యదర్శులు రాజేశ్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

శెట్‌పల్లిలో నర్సరీ పనులను పరిశీలిస్తున్న ఎంపీవో

అత్యుత్తంగా విద్యను బోధించాలి

పద్మావతిని సన్మానిస్తున్న ఉపాధ్యాయురాళ్లు

భైంసా, డిసెంబర్ 20: విద్యార్థులకు అత్యుత్తంగా విద్యను బోధించాలని భైంసా ఏరియా దవాఖాన వైద్యురాలు పద్మావతి పేర్కొన్నారు. భైంసాలోని గౌతమి హైస్కూల్‌లో బుధవారం రాణి రుద్రమాదేవి బాలికల సంరక్షణ సమితి ఆధ్వర్యంలో బాలికలకు కౌమార విద్యపై అవగాహన సదస్సు నిర్వహించారు. బాలికల శారీరక, మానసిక, శుభ్రత వంటి అనేక విషయాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రాణి రుద్రమదేవి, బాలిక సంరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు జాదవ్ పుండలిక్ రావు పాటిల్, పాఠశాల కరస్పాండెంట్ రేగుంట రవీంధర్, అకౌంటెంట్ తాలోడ్ గంగుతాయి, ఉపాధ్యాయులు అమ్రపాలి, సవిత, స్వరూప, బాల బాలికలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డా. పద్మావతిని శాలువాతో పలువురు సన్మానించారు.

స్వచ్ఛభారత్ పితామహుడు సంత్ గాడ్గే బాబా

భైంసా, డిసెంబర్ 20 : స్వచ్ఛభారత్ పితామహుడు శ్రీ సంత్ గాడ్గే బాబా మహారాజ్ అని, పరిసరాల పరిశుభ్రతకు ప్రజల్లో చైతన్యం కల్పించిన మహనీయుడని ది బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా భైంసా అధ్యక్షుడు ప్రసంజిత్ హెమ్లె పేర్కొన్నారు. భైంసా రజక సంఘం లోని దోభీగల్లీలో బుధవారం రజక సంఘం, బీఎస్ఐ భైంసా శాఖ ఆధ్వర్యంలో 67వ సంత్ గాడ్గే మహారాజ్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రప టానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో భైంసా రజక సంఘం సొసైటీ సభ్యులు భూమన్న, భీమేశ్, సాయినాథ్, శంకర్, ముత్యం, బీఎస్ఐ భైంసా అధ్యక్షుడు ప్రసంజిత్ హెమ్లే, పదాధికారులు, తదితరులు పాల్గొన్నారు.

సంత్ గాడ్గే మహారాజ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ప్రతినిధులు

మామడలో 108 వాహనం తనిఖీ

108 వాహనాన్ని తనిఖీ చేస్తున్న నిజామాబాద్, నిర్మల్ జిల్లాల ప్రోగ్రాం మేనేజర్ శ్రీకాంత్

మామడ, డిసెంబర్ 20 : మండల కేంద్రంలో 108 వాహనాన్ని నిజామాబాద్, నిర్మల్ జిల్లాల ప్రోగ్రాం మేనేజర్ శ్రీకాంత్ బుధవారం తనిఖీ చేశారు. అంబులెన్స్‌లో ఉండే ఫార్మలాజికల్ మెడిసిన్ మానిటర్స్ ఆక్సిజన్ ఎలా పనిచేస్తున్నాయని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు, నార్మల్ డెలివరీ, సూసైడ్ కేసులను సేవ్ చేయాలని వారికి తగిన చికిత్స చేస్తూ ప్రభుత్వ దవాఖానలకు తీసుకెళ్లాలని సిబ్బందికి సూచించారు. ఇందులో నిర్మల్ జిల్లా అధికారి మధు, ఈఎంటీ సల్కం శేఖర్, పైలెట్ అజార్, ఆఫీజ్ ఉన్నారు.

ముగిసిన అఖండ హరినామ సప్తాహం

ఊరేగింపుగా వెళ్తున్న మహాగాం గ్రామస్తులు

భైంసాటౌన్, డిసెంబర్ 20 : మండలంలోని మహాగాం గ్రామ వితలేశ్వర ఆలయ ప్రాంగణంలో అఖండ హరినామ సప్తాహం వేడుకలు బుధవారం ముగిశాయి. ఏడు రోజుల పాటు వైభవంగా వేడుకలు నిర్వహించారు. మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు భజనలు, కీర్తనలు ఆలపించారు. ఆలయ కమిటీ అన్నదానం ఏర్పాటు చేసింది.

విద్యార్థుల క్షేత్ర స్థాయి పర్యటన

భైంసా, డిసెంబర్ 20 : భైంసాలోని సరస్వతీ శిశు మందిర్ సుభద్ర నిలయం విద్యార్థులు క్షేత్ర పర్యటనలో భాగంగా బుధవారం మండలంలోని మాటేగాం గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా యాసంగిలో పండించే పంటలు, డ్రిప్ ఇరిగేషన్, వ్యవసాయంలో ఆధునిక యంత్రాల వినియోగంపై వివరాలు తెలుసుకున్నారు. వీరి వెంట ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

యంత్రాలను పరిశీలిస్తున్న విద్యార్థులు

పోలీసులపై దాడికి యత్నం : ఐదుగురి రిమాండ్

సోన్, డిసెంబర్ 20 : పోలీసులపై దాడికి యత్నించిన ఐదుగురిని బుధవారం కోర్టులో హాజరుపర్చగా నిర్మల్ జిల్లా జడ్జి వారికి రిమాండ్ విధించినట్లు సోన్ ఎస్ఐ రవీందర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. సోన్ మండలం మాదాపూర్ గ్రామం వద్ద ఈ నెల 15న రాత్రి 11 గంటల సమయంలో ఐదు మద్యం తాగి ఇబ్బందులకు గురి చేస్తున్నారని బాధితులు 100 డయల్‌కు కాల్ చేయడంతో పెట్రోకార్ సిబ్బంది రామకృష్ణ, శేఖర్‌తో పాటు మరో ఇద్దరు అక్కడికి వెళ్లారు. వారి వివరాలను తెలుసుకున్నారు. ఈ నేపథ్యంలో మద్యం మత్తులో ఉన్న పెసరి మురళి, పెసరి నవీన్, బర్మ ప్రవీణ్ కుమార్, పెసరి దామోదర్, మేకల నిఖిల్ పోలీసులతో వాగ్వాదానికి దిగారు. దురుసుగా ప్రవర్తించడమే కాకుండా దాడికి యత్నించారు. పెట్రోకారు వాహనం అద్దాలు పగిలిపోయాయి. సిబ్బంది ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశామని ఎస్ఐ రవీందర్ పేర్కొన్నారు. నిందితులను కోర్టులో హాజరుపర్చగా న్యాయస్థానం రిమాండ్ విధించిందని ఆయన తెలిపారు.

అంధత్వ నిర్మూలనే లక్ష్యం

ముధోల్, డిసెంబర్ 20 : అంధత్వ నిర్మూలననే లక్ష్యంగా ఎల్వీ ప్రసాద్ కంటి దవాఖాన సిబ్బంది పనిచేస్తున్నారని ముధోల్ మాజీ ఎమ్మెల్యే నారాయణ రావు పతటేల్ అన్నారు. ముధోల్‌లోని ఎల్వీ ప్రసాద్ కంటి దవాఖాన 27 వ వార్షికోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సీనియర్ ఉద్యోగులను శాలువాతో ఘనంగా సత్కరించారు. ఎల్వీ ప్రసాద్ వైద్య విజ్ఞాన సంస్థ వైస్ చైర్మన్ రాజీవ్ రెడ్డి, డాక్టర్లు వర్షారాణి, సోమశీల మూర్తి, అడ్మినిస్ట్రేటివ్ జోజి ప్రసాద్, డా. దీక్ష, సందీప్ రావు, నరేశ్‌రావు, ముధోల్ సర్పంచ్ రాజేందర్, నాయకులు గంగారెడ్డి, పతంగి కిషన్, శంకర్ చంద్రే ఉన్నారు.

బోధనోపకరణాల ప్రదర్శన

కుంటాల, డిసెంబర్ 20 : పెంచికల్‌పాడ్ ప్రాథమిక పాఠశా లను బుధవారం రూమ్ టూ రీడ్ రాష్ట్ర కోఆర్డినేటర్ వినయ్ బాబు సందర్శించారు. బోధనోపకరణాలను విద్యార్థులు ప్రదర్శించారు. ఉపాధ్యాయుడు ఎల్లన్న, ఎండీ సయ్యద్, ఎల్లన్న, హెచ్ఎం ఉమారాణి, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

బోధనోపకరణాలను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

ఆపద్బాంధవులు

- ఒక్క ఫోన్‌కాల్‌తో క్షణాల్లో బాధితుల చెంతకు
- ఇప్పటికే 3 వేల మందికి పైగా రక్తదానం

భైంసా, డిసెంబర్ 20 : అన్ని దానాల్లో కెల్లా రక్తదానం మిన్న అన్నారు పెద్దలు.. అందుకే ఎవరైనా ప్రమాదానికి గురైతే వారికి సకాలంలో రక్తం అందించడం అత్యవసరం. ఇలా సకాలంలో రక్తం అందక రోజు ఎంతో మంది ప్రాణాలు కోల్పోతూనే ఉన్నారు. అలాంటి వారిలో కొంత మందికైనా తాము రక్తాన్ని అందించి వారి ప్రాణాలు కాపాడడంతో తమవంతు పాత్ర పోషిస్తున్నారు. భైంసాలో బ్లడ్‌గ్రూప్ డొనేషన్ పేరిట ఔట్ సోర్సింగ్ ఉద్యోగి సురేశ్, ఆనందిత ఫౌండేషన్, సహారా బ్లడ్‌గ్రూప్ ఆధ్వర్యంలో పలువురు బ్లడ్‌గ్రూప్(వాట్సాప్ గ్రూప్‌లు) తయారు చేసి ఆసుపత్రిలో రక్తం కోసం అత్యవసర సమయాల్లో ఎదురుచూసే వారికి చేయూత అందించాలని నిర్ణయించుకున్నారు. తనతో పాటు మిత్రులతో కలిసి బ్లడ్ గ్రూప్‌లను ఏర్పాటు చేశారు. దాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు సోషల్ మీడియాను వేదికగాచేసుకున్నారు. అప్పటి నుంచి రక్తం అవసరమైన వారికి ఒక్క ఫోన్ కాల్‌తో బాధితుల వద్దకు వెళ్లి రక్తదానం చేయడం ప్రారంభించారు. సుమారు వెయ్యి మంది వరకు చేరగా వీరు బాధితుల వద్దకు వెళ్లి స్వచ్ఛందంగా రక్తదానం చేసి ఎంతో మంది ప్రాణాలను కాపాడారు. మొత్తం భైంసా బ్లడ్‌గ్రూప్ ఇప్పటి వరకు 3 వేల మందికి పైగా రక్తం అందించి వారిని ప్రాణాపాయం నుంచి కాపాడారు. వీరి సేవలను పలువురు అభినందిస్తున్నారు.

13 సార్లు రక్తదానం చేసిన ఆనందిత ఫౌండేషన్ సభ్యుడు లక్ష్మణ్